

నేడు ఎస్ఐ ఉద్యోగాలకు రాత పరీక్ష

హాజరు కానున్న 8458 మంది అభ్యర్థులు

ప్రజాశక్తి-విజయనగరం

ఎపిఎస్ఎల్‌పిఆర్‌బి ఆధ్వర్యాన సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు ఉద్యోగ నియామకాలకు ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక రాత పరీక్ష జరుగనుంది. జిల్లాలోని 10 పరీక్షా కేంద్రాల్లో జరిగే ఈ పరీక్షకు 8,458 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. ప్రాథమిక రాత పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎస్‌పి ఎం.దీపిక పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. పేపర్ 1 పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, పేపర్ 2 పరీక్ష మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులను గంట ముందు నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. ఒక్క నిముషం ఆలస్యమైనా అనుమతించరు. అభ్యర్థులు గుర్తింపుగా ఆధార్‌కార్డు లేదా పాన్‌కార్డు, డ్రైవింగ్‌లైసెన్సు, ఓటరు కార్డు, రేషన్‌కార్డు వంటి ఏదైనా ఒరిజినల్ గుర్తింపుకార్డును తీసుకెళ్లాల్సి ఉంది.

నగరంలో ఫిల్లర్లతో నిలిచిపోయిన సంస్కృత హైస్కూల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం



నాడు-నేడు.. ఇంకెప్పుడు?

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం ప్రారంభించిన మనబడి నాడు-నేడు కార్యక్రమం.. నిధుల కొరతతో పడకేసింది. ఈ కార్యక్రమంలో రెండోదశ పనులు అస్తవ్యస్తంగా మారాయి. పేరుకు ప్రతిష్టాత్మక కార్యక్రమమే అయినా నిధులు విడుదలలో మాత్రం చిట్టచివర నిలవడంతో చాలాచోట్ల పనులు ఆగిపోయాయి. నిధులు రాకపోవడంతో పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

- నిధులు రాక నిలిచిపోయిన పనులు
- రెండోదశలో రూ.231.24 కోట్లకు ఇచ్చింది రూ.45.90 కోట్లే
- మెటీరియల్ కాంట్రాక్టర్లకు నిలిచిన చెల్లింపులు
- కమిటీలకు అరకొర నిధులు
- నిధులు రాక ముఖం చాటేస్తున్న వైనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 737 పాఠశాలల్లో రూ.231.24 వేల కోట్ల అంచనాతో నాడు-నేడు రెండో విడత పనులను 2021 ఆగస్టులో ప్రారంభించారు. ఏడాదిన్నర దాటిపోయినా ఇప్పటివరకూ విడుదల చేసిన నిధులు కేవలం రూ.49.59 కోట్లే. మిగిలిన నిధుల విడుదలకు ఎంతకాలం పడుతుందో తెలియని పరిస్థితి కనిపిస్తోంది. దీంతో వైసిపి ప్రభుత్వానికి మిగిలిన ఏడాది కాలంలో ఈ పనులు పూర్తికావడం కష్టమేనని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

నిధుల విడుదలలో వైఫల్యం

నాడు-నేడు నిధులు మొత్తం రాష్ట్ర ప్రభుత్వం నుంచే రావడం లేదు. ప్రపంచ బ్యాంకు నుంచి కొంతమేర రుణాన్ని సర్కారు సమీకరించింది. ఇక అమ్మఒడి పథకంలో పాఠశాల భవన నిర్వహణ నిధి కింద కొంత మినహాయించుకుంది. తల్లులకు అందాల్సిన నిధుల్లో ముందుగానే కోత పెట్టినా, వాటిని కూడా ప్రభుత్వం ఇతరత్రా అవసరాలకు వాడేసింది. ఇలా వివిధ రూపాల్లో సమీకరిస్తున్నా క్రమంగా నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఇటీవల మెటీరియల్ ధరలు భారీగా పెరిగిపోవడంతో ప్రభుత్వం అరకొరగా ఇస్తున్న నిధులు ఏమూలకూ సరిపోవడం లేదు. నిధులు విడుదల కాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

విజయనగరం జిల్లా కేంద్రంలోని బాబామెట్టలో ఉన్న బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వసతులు లేవని కారణంగా 15 గదులు అదనంగా నిర్మించేందుకు నాడు-నేడు కార్యక్రమం కింద రూ.1.74 కోట్లతో పరిపాలన ఆమోదం ఇచ్చారు. మొదటి విడతగా రూ.35.6 లక్షలు విడుదల చేశారు. ఈ నిధులు ఉన్నంత వరకు నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో మిగిలిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. జిల్లాలో 737 పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఎప్పటికి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందో, ఎప్పటికి రెండో విడత నాడు-నేడు పనులు పూర్తి అవుతాయో ప్రభుత్వమే చెప్పాల్సి ఉంది.

20 శాతమే!

2021 ఆగస్టులో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి.. మనబడి నాడు-నేడు కార్యక్రమం రెండో విడత పనులకు శ్రీకారం చుట్టారు. 2022 జూలై నాటికి పనులు పూర్తిచేస్తామని అప్పట్లో ప్రకటించారు. అయితే పరిపాలనా అనుమతులు ఇచ్చేందుకే సుమారు ఏడాది సమయం పట్టింది. ఇప్పటివరకూ విడుదల చేసిన నిధులతో పనులు చేసిన ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీల సభ్యులు రావాల్సిన వాటి కోసం ఎదురుచూస్తున్నారు. 2023 ఫిబ్రవరి చివరికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికీ కేవలం 20 శాతం పనులు మాత్రమే జరిగాయి. మిగిలిన పనులు ఎప్పటికి పూర్తవుతాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



బాబామెట్టలో బాలికల హైస్కూల్ స్లాబ్ వేసి వదిలేసిన భవనం

శైవ క్షేత్రాలు కిటకిట

మహాశివరాత్రి సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లాలోని శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. శనివారం తెల్లవారు జామునుంచే యాత్రికులు ఆలయాలకు క్యూకట్టారు. పారమ్మకొండ, అడ్డాపుశీల, గుంప సోమేశ్వర ఆలయాలకు జనాలు పోటెత్తారు. పారమ్మకొండపై పారమ్మతల్లికి డిప్యూటీ సిఎం రాజన్నదొర దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.



పాచిపెంట... పారమ్మకొండపైకి భారీగా వెళ్తున్న యాత్రికులు

వీడని భయం

ఏనుగుల సంచారంతో భయభ్రాంతులకు గురైన మండల ప్రజలు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని కిమ్మి, నడుకూరు గ్రామాల సమీపంలో ఏనుగుల గుంపు సంచరిస్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. విజయనగరం జిల్లా వంగర మండలం తలగాం గ్రామం నుంచి వీరఘట్టం మండలంలోకి శుక్రవారం గజరాజుల గుంపు చేరుకుంది. అదేరోజు నడుకూరు గ్రామానికి చెందిన మచ్చ సన్యాసినాయుడు చెరకు తోటలోకి చేరుకుని, సాయంకాలం వరకు అక్కడే ఉన్నాయి. చీకటి పడేసరికి గ్రామ సమీపంలోకి వచ్చేశాయి. అందులో హరి అనే ఏనుగు గ్రామ ప్రధాన రహదారి మీదుగా సంచరిస్తూ మూలలంక గిరిజన గ్రామానికి చేరుకుంది. దీంతో పోలీసు, ఫారెస్ట్ అధికారులు అప్రమత్తమై గ్రామంలో ఉన్న షాపులను మూసి వేశారు. వాహన రాకపోకలు కూడా నిలిపివేశారు. అదే సమయంలో కిమ్మి గ్రామానికి ఎవరినీ వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. మిగిలిన గజరాజుల గుంపు గ్రామానికి అతి దగ్గరలో ఉండటం వల్ల నడుకూరు గ్రామస్తులకు రాత్రంతా కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఏ క్షణంలో గ్రామంలోకి ప్రవేశిస్తాయోనన్న భయంతో ఇళ్ల నుంచి బయటికి రాలేదు. శనివారం ఉదయం మళ్లీ పొలాల్లోకి వచ్చి తిష్ట వేశాయి.

ఏనుగుల దగ్గరికి ఎవరినీ వెళ్లనీకుండా పోలీస్ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. రైతు రౌతు రామారావుకు చెందిన మొక్కజొన్న పంటను ఏనుగులు నాశనం చేశాయి. మరో పది రోజుల్లో పంట కోస్తామన్న తరుణంలో గజరాజులు ధ్వంసం చేయడంతో ఆ రైతు లబోదిబోమంటున్నాడు. నడుకూరు గ్రామానికి చెందిన ఎం.సన్యాసినాయుడు చెరుకు తోటలో గజరాజుల గుంపు తిష్టవేయడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఆ తోటకు నిప్పంటించారు. దీంతో చిట్టిపూడివలస వైపు పయనమైన ఏనుగులు మళ్లీ అదే స్థానానికి చేరాయి. ఏనుగుల గుంపు సంచారంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.



ఏనుగులు ధ్వంసం చేసిన మొక్కజొన్న పంట



నడుకూరు గ్రామ సమీపంలోని చెరకు తోటల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

చంద్రబాబును అడ్డగింతపై టిడిపి నిరసనలు



కురుపాంలో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి - కురుపాం

అనపర్తిలో టిడిపి అధినేత చంద్రబాబునాయుడును పోలీసులు అడ్డుకోవడంపై జిల్లాలో పలుచోట్ల శనివారం టిడిపి ఆధ్వర్యాన నిరసనలు చేపట్టారు. కురుపాంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి ఆధ్వర్యాన ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత మొదలైందని, రానున్న ఎన్నికల్లో వైసిపికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కలిశెట్టి కొండయ్య, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, జియ్యమ్మ వలస ఎంపిపి బొంగు సురేష్, టిడిపి నాయకులు పల్ల రాంబాబు, శేఖర్ పాత్రుడు, అక్కేన మధు, దేవకోటి వెంకట నాయుడు, లంక గోపాలం, పొట్నూరు వెంకటనాయుడు, కృష్ణబాబు, చంటి, సాయి పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటూ టిడిపి ఆధ్వర్యంలో పెదమేరంగి జంక్షన్లో రాస్తారోకో నిర్వహించారు. టిడిపి నాయకులు డొంకాడ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ పట్టణంలోని పాతబస్టాండ్‌లో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహం నుండి జిల్లా అస్పత్రి కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వరకూ టిడిపి ఆధ్వర్యాన పాదయాత్ర చేపట్టారు. అనంతరం రాజ్యాంగాన్ని రక్షించాలని అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ డి.జగదీశ్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు వినతి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల అండతో ప్రశ్నించే గొంతుకలను, ప్రభుత్వ వ్యతిరేక గళాలను అణచివేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ రాక్షసపాలన కొనసాగిస్తోందని ధ్వజమెత్తారు. ఇప్పటికే రాష్ట్రంలోని మేధావి వర్గాలన్నీ ప్రభుత్వం తీరుపై అసహనం ప్రదర్శిస్తున్నాయన్నారు. ప్రజలు కూడా పూర్తిగా విసిగిపోయారన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ, మండల అధ్యక్షులు జి.రవికుమార్, దొగ్గ మోహనరావు, నాయకులు జి.వెంకటనాయుడు, ఉదయభాను, బోను చంద్రమౌళి, కోల వెంకటరావు, కె.ప్రదీప్, కె.తిరుపతిరావు, కౌన్సిలర్లు బడే గౌరినాయుడు, తాతపూడి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : పోలీసుల తీరును వ్యతిరేకిస్తూ పెదపెంకిలో టిడిపి మండల అధ్యక్షులు పెంకి వేణుగోపాలనాయుడు, నాయకులు వాడాడ రాము ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు : రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వానికి బుద్ధి కోరుతూ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.సంధ్యారాణి ఆధ్వర్యాన నాయకులు, కార్యకర్తలు గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. నల్లబ్యాడ్జీలు ధరించిన సంధ్యారాణి వైసిపి ప్రభుత్వ తీరుకు నిరసనగా మౌనం వహించారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును అడ్డుకోవడం దుర్మార్గమని ఆమె వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య విరుద్ధంగా జగన్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. సైకో పాలన పోవాలని, సైకిల్ పాలన రావాలని కార్యకర్తలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు కూనిశెట్టి భీమారావు, మాజీ వైస్ చైర్మన్ పి.మోహనరావు, మండల అధ్యక్షుడు ఆముదాల పరమేష్, పాచిపెంట మండల నాయకులు ముఖి సూర్యనారాయణ పాల్గొన్నారు.





సాలూరు, పార్వతీపురంలో గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు వినతులు అందిస్తున్న మాజీ ఎమ్మెల్సీలు సంధ్యారాణి, జగదీశ్, మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు



పట్టణంలో సిఎం జగన్ ఫొటోతో తిరుగుతున్న రేషన్ వాహనం


నిబంధనలు వర్తించవా..?

రేషన్ బళ్లపై సిఎం పోస్టర్

ప్రజాశక్తి-పాలకొండ

ప్రస్తుతం జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఎన్నికల నియమావళి అమలు చేసేందుకు అధికారులను నియమించింది. అయితే బహిరంగ ప్రదేశాల్లో ఉన్న పోస్టర్లను తొలగించారు తప్ప రేషన్ బియ్యం సరఫరా చేస్తున్న వాహనాలపై మాత్రం సిఎం ఫొటోను తొలగించలేదు. ఎన్నికల నియమావళి ప్రకారం సిఎం ఫొటో తొలగించాలి, లేకుంటే కనిపించకుండా చేయాలి. కానీ అధికారులు మాత్రం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.





పాలకొండలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు ; కొమరాడలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

రమాప్రభకు మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి-పాలకొండ

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం పాలకొండ పట్టణంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, జెవివి జిల్లా కార్యదర్శి ఎస్.ఉమా మహేష్, జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు పి.ప్రభాకర్ మాట్లాడారు. సిపిఎస్ రద్దు, ఒపిఎస్ పునరుద్ధరణ, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు రెగ్యులరైజేషన్, తదితర సమస్యలపై పనిచేసే అభ్యర్థి రమాప్రభను ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు.

కొమరాడ : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభను గెలిపించాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. శనివారం రమాప్రభకు మద్దతుగా కొమరాడ, గుమడలో సిఐటియు, గిరిజన, రైతు సంఘాల ఆధ్వర్యాన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబమూర్తి, ఎపి రైతు సంఘం నాయకులు ఎ.ఉపేంద్ర, గిరిజన సంఘం నాయకులు దాలయ్య మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై నిరంతరం గళం విప్పేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనని చెప్పారు. మొదటి ప్రాధాన్యత ఓటును రమాప్రభకు వేయాలని కోరారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరే..!

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పోతే పోనీ... ప్రాణాలు మనవి కాదుగా... అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు విజయనగరం ఉమ్మడి జిల్లాలోని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, నాయకులు. ఓవైపు పార్వతీపురం మన్యం జిల్లాలో ఏనుగుల దాడిలో మరణాల పరంపర కొనసాగుతోంది. మరోవైపు విజయనగరం జిల్లాలో పెద్దపులి సంచారం ఇంకా కొనసాగుతునే ఉంది. దీంతో, ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గుడుపుతున్నారు. చివరకు కలెక్టర్ తన ఫ్యామిలీతో కలిసి ఏనుగుల గుంపును చూసి ఎంజాయ్ చేశారే తప్ప వాటివల్ల ప్రజలకు ప్రాణముప్పులేకుండా చేసేందుకు ప్రయత్నించలేదు. జిల్లాకు చెందిన గిరిజన శాఖ మంత్రి కూడా తనకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. విజయనగరం జిల్లాలో పశువులు ఎప్పటికప్పుడు పులికి ఆహారంగా మారుతున్నాయి. అయినా మంత్రి బొత్సకుగానీ, ఎంపీ, ఎమ్మెల్యేలకుగానీ పట్టలేదు. ఇక కలెక్టర్ చొరవ గురించి వేరేగా ప్రస్తావించక్కర్లేదు. వాస్తవానికి ఏనుగుల ప్రమాదం ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చిందేమీ కాదు. 2004లోనే పార్వతీపురం ఏజెన్సీలో ఏనుగుల ఉనికి వెలుగులోకి వచ్చింది. ఎక్కడికక్కడ పంటలు ధ్వంసం చేయడంతోపాటు ప్రాణ నష్టం సంభవించింది. అప్పటి అటవీశాఖ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు ఆదేశాల మేరకు ఈ ప్రాంతంలో ఉన్న అడవి ఏనుగుల గుంపును ఒడిశా ప్రాంతానికి తరలించేందుకు ఆపరేషన్ గజ కార్యక్రమాన్ని ప్రభుత్వం, అటవీ శాఖ అధికారులు చేపట్టారు. తమిళనాడు నుంచి ట్రైనింగ్ పొందిన జయంతి అనే మగ ఏనుగును తీసుకువచ్చి అడవి ఏనుగులు గుంపును తరలించేందుకు పలు రకాలుగా ప్రయత్నాలు చేసినా అది పూర్తిస్థాయిలో



విజయవంతం కాలేదు. దీంతో ఆ కార్యక్రమానికి ప్రభుత్వం ఫుల్ స్టాప్ పెట్టింది. దీంతో, మన్యం జిల్లాలో ఏనుగుల ముప్పు నాటి నుంచీ కొనసాగుతునే ఉంది. ప్రజలకు కంటిమీద కునుకులేకుండా పోతోంది. అటు పంట నష్టం, ఇటు ప్రాణ నష్టం జరుగుతుండడం పట్ల ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇలా ఏనుగుల దాడిలో గడిచిన 16 ఏళ్లలో సుమారు 15 మంది వరకు గిరిజనులు, రైతులు మత్యువాత పడ్డారు. తాజాగా బలిజిపేట మండలం చెల్లింపేటలో ఓ వృద్ధుడిపై దాడి చేసి చంపేశాయి. అంతకు ముందు బామిని మండలంలో ఏనుగులు తరలించేందుకు వెళ్లిన ట్రాకర్ కూడా ప్రాణాలకు కోల్పోయాడు. అయినా అటు అధికారులు, ఇటు పాలకులు ఏనుగులను తరలించడం, ప్రజలకు రక్షణ కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందుతునే ఉన్నారు. ఏనుగుల తరలింపు, ట్రాకింగ్ పేరిట ప్రభుత్వం నుంచి అటవీశాఖకు ఇప్పటి వరకు రూ.కోట్ల విడుదల అయ్యాయి. నిధుల కేటాయింపు, ఖర్చు నిరంతర ప్రక్రియగా మారినా సమస్య పరిష్కారానికి చూపిన చిత్తశుద్ధి కనిపించడం లేదు. అటవీ శాఖ అధికారులు ఎలిఫెంట్ జోన్ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామంటూ ఇంకా పాత పాటే పాడుతున్నారు. ఇందుకోసం పార్వతీపురం పరిసర ప్రాంతం, కొమరాడ మండలం అర్తాం, సాలూరు మండలం జంతి కొండ పరిసర ప్రాంతాలలో ఎలిఫెంట్ జోన్ కోసం బృంద సభ్యులు పరిశీలన చేసినట్టుగా చెబుతున్నారు. ఇందుకోసం రూ.70కోట్లు అవసరం ఉంటుందని అంచనా వేశారు. కేంద్రం నుంచి అనుమతులు వస్తే పనులు చేపట్టేందుకు వీలుంటుదని చెబుతున్నారు. ఇటువంటి సమస్యలేవీ అటు కేంద్ర ప్రభుత్వానికి కూడా పట్టడం లేదు.

కిటకిటలాడిన శివాలయాలు


పాచిపెంట.. పారమ్మకొండపై పూజలు చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర దంపతులు

పారమ్మకొండపై పూజలు చేసిన డిప్యూటీ సిఎం దంపతులు

ప్రజాశక్తి-పాచిపెంట

మహాశివరాత్రిని పురస్కరించుకొని శనివారం జిల్లాలోని శివాలయాలు కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే యాత్రికులు తండోపతండాలుగా ఆలయాలను దర్శించుకున్నారు. పాచిపెంట మండలంలోని పనుకువలస పంచాయతీ పెద్దచీపురువలస సమీపంలోని పారమ్మకొండ వద్ద శివరాత్రి ఉత్సవాలకు యాత్రికులు భారీగా తరలివచ్చారు. యాత్రకు ఉత్తరాంధ్ర, ఒడిశా, చత్తీస్‌గడ్, మధ్యప్రదేశ్ నుంచి వేలసంఖ్యలో పోటెత్తారు. పారమ్మకొండ దిగువున నిర్మించిన పారమ్మ తల్లి ఆలయంలో యాత్రికులు పూజలు చేసిన అనంతరం కొండపై విగ్రహాన్ని దర్శించుకున్నారు. పారమ్మతల్లి విగ్రహానికి డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. సాలూరు పట్టణానికి చెందిన పలు స్వచ్ఛంద సేవా సంస్థలు భోజనాలు, అల్పాహారం, మజ్జిగ, పులిహోర ప్యాకెట్లు, తాగునీరు అందజేశాయి. సాలూరు ఆర్‌టిసి డిపో నుండి ప్రత్యేక బస్సులను కొండ వద్దకు ఏర్పాటు చేశారు. సాలూరు సిఐ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సీతంపేట : సీతంపేటలో కాశీ విశ్వేశ్వర ఆలయం, పలిపుట్టిలో బూలింగేశ్వర ఆలయం, రామగిరి క్షేత్రం వద్ద శివాలయం వద్ద జనాల తాకిడి కనిపించింది. కాశీ విశ్వేశ్వర ఆలయాన్ని సీతంపేట ఐటిడిఎ పిఒ నవ్య సందర్శించారు.

మక్కువ : మండలంలో పురాతన ఆలయాలైన శాంతేస్వరం, కాశీవిశ్వేశ్వర ఆలయాలతోపాటు పలు గ్రామాల్లోని శివాలయాలకు యాత్రికులు పోటెత్తారు. పాయకపాడులోని ఇందిరమ్మ పేరంటాల వద్ద ప్రత్యేక అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు.

గుంప ఆలయానికి యాత్రికుల తాకిడి

కొమరాడ : మండలంలోని గుంప సోమేశ్వర ఆలయానికి మహాశివరాత్రి సందర్భంగా యాత్రికుల తాకిడి పెరిగింది. జంఝావతి, నాగావళి నదుల మధ్య ఉన్న ఈ ఆలయానికి ఇరువైపుల నుంచి యాత్రికులు నడుచుకుంటూ వెళ్లి మహాశివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీపురం డిపో నుంచి 10 బస్సులను ప్రత్యేకంగా నడిపారు. జనాలకు ఇబ్బంది కలగకుండా ఎస్ఐ జగదీష్ నాయుడు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

సదుపాయాలు కరువు

ఆలయం వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడంతో నది


సీతంపేట.. ఆలయంలో పూజలు చేస్తున్న ఐటిడిఎ పిఒ నవ్య

నుంచి ఆలయానికి యాత్రికులు అనేక అవస్థలు పడుతూ వస్తున్నారు. కనీసం తాగునీరు లేకపోవడంతో నదిలో ప్రవహించిన నీటినే తాగాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఉచితంగానే దర్శనానికి అనుమతించినా ఈ ఏడాది టిక్కెట్లు రూపంలో నగదు వసూళ్లు చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

అడ్డాపుశిలకు పోటెత్తిన జనం

పార్వతీపురంరూరల్ : శివరాత్రి సందర్భంగా అడ్డాపుశిల కాశీవిశ్వేశ్వర ఆలయానికి యాత్రికులు తరలివచ్చారు. అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ డి.సౌజన్య దంపతులు, మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు కుటుంబంతో సహా దర్శించుకున్నారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేసినట్టు ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ అక్కేన సుందరనాయుడు, సర్పంచ్ రామోలు రామకృష్ణ తెలిపారు. రూరల్ ఎస్ఐ సింహాచలం ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. మండలంలోని నరిసిపురం, వెంకంపేట, తాళ్లబురిడి, చినబొండపల్లి, బందలుప్పి గ్రామాల్లోని శివాలయాల్లో యాత్రికులు సందడిచేశారు. పెదబొండపల్లి రామలింగేశ్వర ఆలయం వద్ద 3వేల మందికి అన్నదానం నిర్వహించారు.

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురం, బొద్దిడిలో శివాలయాలు శివరాత్రి సందర్భంగా యాత్రికులతో కిటకిటలాడాయి.


కొమరాడ.. గుంప సోమేశ్వర ఆలయం వద్ద క్యూలైన్లలో బారులు తీరిన యాత్రికులు

పాలకొండ రూరల్ : మహాశివరాత్రి సందర్భంగా పాలకొండ పట్టణ, మండల పరిధిలోని శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. పట్టణంలో కాశీ విశ్వేశ్వర, ఉమా రామలింగేశ్వరస్వామి, భీమలింగేశ్వర, సనారి విశ్వేశ్వర ఆలయాలకు భారీగా యాత్రికులు తరలివచ్చారు.

పార్వతీపురం టౌన్ : పట్టణంలో కాశీవిశ్వేశ్వర, ఉమా మార్కండేశ్వర, భ్రమరాంబిక మల్లికార్జున స్వామి, ఆర్యవైశ్య, కళింగ వైశ్య కన్యకా పరమేశ్వరి, భద్రకాళి, ఈసానేశ్వర, పశుపతి నాథ్ ఆలయాలకు యాత్రికులు పోటెత్తారు. నెయ్యిల వీధిలో పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సాలూరు రూరల్ : మండలంలోని కాకుడువలసలో చంద్రమౌళీశ్వర ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పూజలుచేశారు.

సీతానగరం : మండలంలో సీతానగరం, బూర్జ, తామరకండి, గుచ్చిమి, కాశీపేట, లక్ష్మీపేట గ్రామాల్లో శివాలయాలకు యాత్రికులు పోటెత్తారు.

వీరఘట్టం : వీరఘట్టంలోని చంద్రమౌళేశ్వరి, ఓంశాంతి దేవాలయాలతో పాటు చిదిమి, బిటివాడ, దశమంతపురం, కంబర తదితర గ్రామాల్లో ఆలయాలు జనాలతో కిటకిటలాడాయి.


మక్కువ.. ఆలయం వద్ద బారులు తీరిన యాత్రికులు


పార్వతీపురంరూరల్.. అడ్డాపుశిల ఆలయం వద్ద పూజలు చేస్తున్న జనం


సాలూరురూరల్.. చంద్రమౌళీశ్వర ఆలయాన్ని సందర్శించేందుకు కొండపైకి వెళ్తున్న యాత్రికులు


సంతలో ప్రచారం చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

గిరిజన ఉత్పత్తులకు మద్దతుధర కల్పించాలని 20న ధర్నా

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని 20న జిసిసి కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నట్లు గిరిజన సంఘం నాయకులు పి.సాంబయ్య, ఎ.గంగాధర్, జె. శ్రీరాములు తెలిపారు. ఈ మేరకు ధర్నాను విజయవంతం చేయాలని శనివారం కుసిమి సంతలో వారు ప్రచారం చేపట్టారు. ఆరుగాలం శ్రమించిన సేకరించిన ఉత్పత్తులకు జిసిసి మద్దతు కల్పించకపోవడంతో గిరిజనులు దళారుల దోపిడీకి గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.


రోడ్డు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ ముసురు

సిసి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని మారుమూల కొండలపై ఉన్న కీసరగూడ గ్రామంలో సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ఈ పనులు మంజూరయ్యాయి. తన విజ్ఞప్తి మేరకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి సర్పంచ్ ముసురు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రహదారి నిర్మాణ పనులను కీసరగూడ గ్రామస్తుల ఆధ్వర్యంలో త్వరితగతిన చేపడతామని చెప్పారు. రహదారి నిర్మాణం వల్ల కీసరగూడ గ్రామస్తులకు ఉపాధి కూడా దొరుకుతుందని తెలిపారు.

రుతు ఆరోగ్య అవగాహనపై సర్వే

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

కౌమార దశ బాలికల్లో రుతు ఆరోగ్య అవగాహనపై సర్వే నిర్వహించారు. శనివారం తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఆరోగ్య మంత్రిత్వ శాఖ రీసెర్చ్ ఇన్వెస్టిగేటర్ వై.రమణ, రీసెర్చ్ ఫెలో టి.శ్రీనివాస్ సర్వే నిర్వహించారు. పి.ఆమిటి, తాడికొండ, రెల్ల, చెముడుగూడ, లుంబేషు, ఎగువ తాడికొండ గ్రామాల్లో సర్వే నిర్వహించామని వారు తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు బుద్దేశ్వరరావు, పి.అభిలాష్, సిబ్బంది పాల్గొన్నారు.


సర్వే చేస్తున్న బృంద సభ్యులు

అతిథిగృహం.. ఎప్పటికి ఇచ్చేనో ఆతిథ్యం

- ఆరేళ్లయినా నిర్మాణం పూర్తికాని ఆర్‌అండ్‌బి భవనం
- బిల్లులు సకాలంలో మంజూరు కాకే జాప్యం

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో నిర్మించిన రోడ్లు భవనాల శాఖ అతిథిగృహం నిర్మాణం ప్రారంభించి దాదాపు ఆరేళ్లయింది. ఆర్ అండ్ బి డిఇ కార్యాలయం పక్కనే నిర్మిస్తున్న ఈ భవనం అసంపూర్తిగా మిగిలిపోయింది. గతంలో ఇదే ప్రదేశంలో అతిథి గృహం ఉండేది. అది పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో వదిలేశారు. గత ప్రభుత్వ హయాంలో 2017లో రూ.1.30 కోట్లతో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టరుకు సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో భవన నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది. టిడిపి ప్రభుత్వం హయాంలో నిధులు మంజూరై పనులు ప్రారంభించినా బిల్లులు మంజూరు కాలేదు. వాస్తవంగా ఈ భవన నిర్మాణం 2018 నాటికే పూర్తి చేయాలి. 80 శాతం పనులు పూర్తయ్యాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కొద్ది నెలల క్రితం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ సిఎం రాజన్నదొర ఒకటో వార్డులో పర్యటించారు. ఆ సమయంలో ఈ భవనం అసంపూర్తిగా మిగిలిపోవడానికి కారణాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. అతిథిగృహ నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. ఇటీవల కాంట్రాక్టరుకు బిల్లు మంజూరైనట్లు అధికారులు చెబుతున్నారు. డిప్యూటీ సిఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న రాజన్నదొర అధికారులతో సమీక్ష సమావేశాలు తన నివాసంలోనే తరచూ నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ కేంద్రంలో కనీసం క్యాంపు ఆఫీసు కూడా లేదు. ఇలాంటి పరిస్థితుల్లో అతిథిగృహం అయినా ఉంటే అధికారిక కార్యక్రమాలకు, విఐపిలకు ఆతిథ్యం ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని పలువురు భావిస్తున్నారు. త్వరగా భవన నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.


అర్థాంతరంగా నిలిచిపోయిన ఆర్‌అండ్‌బి అతిథిగృహం ఇదే

త్వరలో పనులు ప్రారంభం

ఆర్‌అండ్‌బి అతిథి గృహ నిర్మాణ పనులు త్వరలో పునప్రారంభమవుతాయి. కాంట్రాక్టరుకు బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడం వల్ల పనుల్లో జాప్యం జరిగింది. త్వరలో పనులు ప్రారంభమవుతాయి.

- కె.విజయకుమార్, జెఇ, ఆర్‌అండ్‌బి, సాలూరు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అక్రమాలు ఆపాలి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్


ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అక్రమాలను, అరాచకాలను వెంటనే ఆపాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో సిపిఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పట్టభద్రులలో ప్రభుత్వం గందరగోళం సృష్టిస్తోందన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థికి మద్దతుగా విద్యాశాఖ ఆర్‌జెడి ప్రతాప రెడ్డి కర్నూలు జిల్లా ఆదోని, అనంతపురం పట్టణంలో విద్యాసంస్థల్లో ఎంఇఒ, హెచ్‌ఎంలను సమావేశపర్చి ఎన్నికల ప్రచారం చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడడం దారుణమన్నారు. తక్షణమే ఎన్నికల సంఘం ప్రతాప రెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతాప రెడ్డి అధికార దుర్వినియోగంపై ప్రశ్నించిన ఎఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్ఐ నాయకులపై అక్రమంగా కేసులు బనాయించి పోలీసులు అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు.

24 నుంచి పంచవర్ణేశ్వరి జాతర

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని డుమ్మంగి - బొద్దిడి గ్రామాల ప్రధాన రహదారి సమీపాన ఉన్న పంచవర్ణేశ్వరి ఆలయం వద్ద ఈ నెల 24 నుంచి 28 వరకు జాతర నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ పాలక క్రాంతి కుమార్ తెలిపారు. 24న శివపార్వతిల కళ్యాణం, అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జాతర సందర్భంగా ఐదు రోజులపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ఆశాజనకంగా మామిడి పూత


విరబూసిన మామిడి పూత

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో ఈ ఏడాది మామిడి తోటలు విరబూసాయి. దీంతో మామిడి రైతులకు ఆశలు చిగురిస్తున్నాయి. మూడేళ్లుగా రైతులు కరోనాతో నష్టపోయారు. ఈ ఏడాదైనా సకాలంలో పంటలు వస్తే చేసిన అప్పుల తీరుతాయనే రైతులు భావిస్తున్నారు. పూత నిలబడి కాయలు బాగా కాయాలని ఆశగా చూస్తున్నారు. గత డిసెంబర్, జనవరిలోనే మామిడి పూత రావడంతో పంట దిగుబడి బాగా వస్తుందనే అంచనాలో ఉన్నారు. ఫిబ్రవరిలోనూ పూత మరింత విరబూయడం, మంచు అంతంతమాత్రంగా ఉండడంతో కాపుపైన కొండంత ఆశలు పెట్టుకున్నారు. మరో వైపు మామిడి కాయలు దిగుబడి ఉన్నా గిట్టుబాటు ధర వస్తుందో, రాదోననే అనుమానాలు రైతులను వెంటాడుతున్నాయి. దళారుల వ్యవస్థ అధికంగా ఉండడంతో రైతులు గిట్టుబాటు ధర పొందలేకపోతున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

గృహ సారథులే వారధులు

ఎమ్మెల్యే జోగారావు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ప్రభుత్వ పాలన మరింతగా ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా గృహ సారథులు పని చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శనివారం మండలంలోని బందలుప్పి సచివాలయ పరిధిలోని గృహ సారథులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు. ప్రతి వాలంటీర్ పరిధిలోని గృహ సారథులు వారికి కేటాయించిన 50 కుటుంబాలకు సంబంధించి అర్హులకు సంక్షేమ పథకాలు అందించి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకువచ్చేలా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికీ చేరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ భూమి రమేష్, సర్పంచులు యాళ్ల ప్రతాప్, ప్రమీల, యాంద్రాపు తిరుపతిరావు, గోర్జి రాజు, బలగ నాగేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పనుకువలసలో జీడి తోట దగ్ధం

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలోని పనుకువలస గ్రామంలో కొనేల అదన్నదొరకు చెందిన సుమారు ఎకరా జీడి తోట అగ్నికి ఆహుతైంది. గ్రామస్తుల కథనం ప్రకారం... తారు రోడ్డుపై ఇటీవల మినప, శనగ చేలు ఆరబెట్టారు. గింజలు రాలగా మిగిలిన తొక్కును వదిలేసి ఎవరో నిప్పంటించడంతో పక్కనే ఉన్న జీడి తోటకి మంటలు వ్యాపించారు. ఈ విషయంపై జీడి తోటను నష్టపోయిన రైతుకు ప్రభుత్వం పరిహారం అందించాలని ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గేదెల సత్యనారాయణ, ఎం.సత్యంనాయుడు డిమాండ్ చేశారు.


కాలిపోయిన జీడితోటను పరిశీలిస్తున్న రైతు

పాఠశాలలో అసాంఘిక కార్యక్రమాలు

వేపాడ : మండలంలోని కరకవలస ప్రాథమిక పాఠశాల అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. ఈ పాఠశాలను నాడు నేడు పనుల్లో భాగంగా అభివృద్ధి చేసినప్పటికీ ప్రహరీ నిర్మాణాన్ని పూర్తి చేయలేదు. దీంతో సాయంత్రం స్కూలు విడిచిపెట్టేసిన తరువాత మందు బాబులు పాఠశాలలోకి చొరబడి విధ్వంసం సృష్టిస్తున్నారు. కుక్కలు, పందులు లోపలికి వెళ్లి పరిసరాలను నాశనం చేస్తున్నాయి. ఈ విషయంపై ఎంఇఒ శ్రీదేవిని వివరణ కోరగా ఉప సర్పంచ్‌గా ఉన్న దుల్ల అప్పన్నను అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయవలసిందిగా పలుమార్లు కోరినప్పటికీ పట్టించుకోలేదని చెబుతున్నారు.